# సారీ బ్రదర్!

రచన : పద్మజా రామకృష్ణ



(రచయిత్రి)

సుధ. శ్రీదేవి కాలేజీకి వెళుతున్నారు కబుర్లు చెప్పుకుంటూ.

"తెల్లచీర, మల్లెపూలు" ఎన్.టి.ఆర్. స్టయిల్లో రాగం తీస్తున్నాడో రోగ్!

సుధ, శ్రీదేవి వెనక్కి తిరిగారు ఒకేసారి.

వాళ్ళకు సీనియర్ అతడు.

ఆ రోగ్ పాడుతున్న పాటను ఆపేసి పల్లికిలిస్తూ వచ్చాడు. అచ్చు కొండముచ్చులా వున్నాడు.

మళ్ళీ మామూలుగా వాళ్ళు కబుర్లు చెప్పుకుంటూ వెళుతున్నారు.

"వయ్యారి హంస నడక దానా!"

మరోపాట వెనుకనుంచి వినిపించింది వాళ్ళకు.

సుధ శ్రీదేవి పట్టించుకోకుండా మామూలుగా కబుర్లు చెప్పుకుంటూ వెళుతున్నారు.

"వయసెక్కడే నీకు నవలామణి"

ఆ రోగ్ మరోపాట అందుకున్నాడు.

"ఏమిటే సుధా! ఈ వెధవ నిడ్డులా పట్టుకున్నాడు" మెల్లిగా అంది శ్రీదేవి.

"ఎప్పుడూ మొహాన్ని అద్దంలో చూసుకొని వుండడు. కోతిమొహం వాడూనూ" తిట్టుకుంది సుధ.

హేమకూడా వారిలో కల్సింది.

"ఏమి నా భాగ్యము" మనస్సులో తెగ సంతోషపడుతున్నాడు.

"ముచ్చటగా ముగ్గురు" మరోపాట అందుకున్నాడు.

ఆ రోగ్‌ను లెక్కచేయకుండా పోతున్నారు ముగ్గురూ.

అతను చుట్టూ చూసాడు.

వీళ్లు ముగ్గురూ తప్ప మరెవ్వరూ లేరు.

కాలేజీకూడా దూరంగానే వుంది.

ఇలాంటి అవకాశం మళ్ళీరాదు.

'యురేకా' మనసులోనే అనుకున్నాడు.

పైకంటే వైజాగ్ పిచ్చాసుపత్రిలో జాయిన్ చేస్తారని తెల్సు.

ముగ్గురూ కబుర్లు చెప్పుకుంటూ వెళుతున్నారు.

గాలికి రెపరెప లాడుతున్న హేమ కొంగును గట్టిగా లాగాడు రోగ్!

అతనివంక చిరాగ్గా చూసింది హేమ.

శ్రీదేవి సిగలోని సిరిమల్లె పువ్వుని సునాయాసంగా తీశాడు.

శ్రీదేవి మాట్లాడలేదు.

నల్లత్రాచులా వుండే సుధ జడను పట్టి లాగాడు.

'గుర్రు' మంటూ వెనక్కు తిరిగింది సుధ.

టక్కున వదిలేసాడు జడను.

అతనిలో హుషారు మరింత పెరిగింది.

ఇన్ని చిలిపిచేష్టలు చేసినా కిమ్మనకుండా ఊరుకుంటున్నారంటే ఏమనుకోవాలి?

తనంటే ముగ్గురికీ ప్రేమ అనుకోవాలా?

లేక...భయం అనుకోవాలా?

వాళ్లు ముగ్గురూ మళ్ళీ కబుర్లలో పడిపోవడం చూసి మరిన్ని చిలిపిపనులు చెయ్యాలనిపించింది అతనికి.

అనిపించడం ఏమిటి...వెంటనే అమలుజరిపాడు.

శ్రీదేవి చెయ్యి పట్టుకున్నాడు.

హేమ నడుం నొక్కాడు.

సుధ బుగ్గను వేలితో మీటాడు.

అదే అతను చేసిన తప్పు!

నడుస్తున్న ముగ్గురూ టక్కున ఆగిపోయారు.

వారితోపాటు అతనూ ఆగాడు.

ఆలస్యమయితే అమృతం విషం అనుకున్నది కాబోలు! వెంటనే జోడుతీసి అతనిచెంప 'చెళ్' మనిపించింది శ్రీదేవి.

వెంటనే అమలులో కొచ్చిన రాజశాసనంలా అతని బుగ్గ బూరెబుగ్గగా మారింది.

'ఒక చెంప అయితే ఏంబాగుంటుందే ఇప్పుడు చూడు' అంటూ ఆ జోడు తీసుకొని రెండో చెంపమీద 'చెళ్' మనిపించింది సుధ.

'కెవ్'మని గట్టిగా అరిచాడు అతడు.

రెండో బుగ్గకూడా బూరీబుగ్గ అయ్యింది.

'మీ రిద్దరూ పని కానిచ్చారు. నేను చేతకాని దాన్నా ఏమిటి?' అంటూ జోడు తీసుకొని జోడుమడమతో అతని నెత్తిమీద 'ఠంగ్' మంటూ కొట్టింది హేమ.

వెంటనే బొప్పి కట్టింది.

ఈసారి గట్టిగా 'కెవ్ వ్ వ్'మన్నాడు పాపం అతను!

'చూడు అన్నయ్యా! ఇంకెప్పుడూ ఎవర్నీ ఏడిపించకు. ఎందుకంటే మేమంతా మీ చెల్లెల్లం కదూ. దెబ్బలు గట్టిగా తగిలాయా...సారీ!' ముగ్గురూ ఒకేసారి అన్నారు.

ఈసారి గట్టిగా 'కెవ్' మన్నాడు.

దెబ్బలు కొట్టినందుకు కాదు. 'అన్నయ్యా అన్నందుకు!

తరువాత అతను కాలేజీకి వస్తే ఒట్టు!

జ్ఞానోదయం అయ్యిందో ఏమిటో పాపం! 'ఆ అన్నయ్య' కాశీవెళ్ళి గంగలో కలిసాడని తరువాత తెలిసిందట వాళ్ళ ముగ్గురకు. 'పాపం బ్రదర్' మనస్సులో అనుకున్నారు.

ఆంధ్రప్రదేశంలో అన్ని షాపులలోను దొరుగుచున్నది

గోపాల్ పళ్ళపొడి




ఒక ప్యాకెట్ వెల 70 పైసలు.